క్లుప్తంగా

ఇంటర్న్‌షిప్‌తో ఉద్యోగ అవకాశాలు మెరుగు



మాట్లాడుతున్న ఇంఛార్జి ప్రిన్సిపాల్ సత్యవతి

చోడవరం రూరల్: విద్యార్థులు పెయిడ్ ఇంటర్న్‌షిప్‌ను వినియోగించుకోవాలని, దీని ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలను మెరుగుపరచు కోగలుగుతారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఐ.వి.వి.సత్యవతి తెలిపారు. మంగళవారం సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విశాఖలోని నిర్మాణ్ సంస్థ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా నెల నెలా సంపాదనతోపాటు ఆయా సంస్థల్లో ఉద్యోగావకాశాలను పొందే వీలుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపన్యాసకులు, ఆయా విభాగాధిపతులు వి.అప్పలనాయుడు, ఎ.కృష్ణారావు, టి.రాధాకృష్ణ, ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ జి.నారాయణమూర్తి ఎస్.మల్లిబాబు, హెచ్.సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

గొట్లాంలో ఘనంగా అయ్యప్ప అంబలం పూజ



అయ్యప్ప అంబలం పూజలో పాల్గొన్న భక్తులు

కె.కోటపాడు : గొట్లాం గ్రామంలో గల అయ్యప్ప ఆలయం పూజా కార్యక్రమాన్ని సోమవారం రాత్రి ఘనంగా జరిపారు. గ్రామానికి చెందిన హరిహర పుత్ర భక్తి పీఠంకు చెందిన అయ్యప్ప భక్తులు, కొట్టాడ అప్పారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబలం పూజను గురుస్వామి అప్పారావు జరిపారు. అయ్యప్ప, వినాయకుని, కుమారస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్ల మండపాలను అరటిజోర్లుతో ఏర్పాటు చేశారు. దీక్షధారులంతా అయ్యప్ప భజన గీతాలతో పాటు శరణుఘోష వినిపించారు. గొట్లాం, మర్రివలస, పాతవలస, కె.కోటపాడు, శృంగవరం, పిండ్రంగి, సూదివలస, చంద్రయ్యపేటతో పాటు కొత్తవలస మండలానికి చెందిన అయ్యప్ప మాలాధారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలి

- జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసరావు

దేవరాపల్లి: లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ వై.శ్రీనివాసరావు లబ్ధిదారులకు సూచించారు. దేవరాపల్లిలోని లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాలను, హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం పీడీ పరిశీలించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారికి వెంటనే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. శ్లాబ్ లెవెల్‌కు చేరుకున్న లబ్ధిదారులు వచ్చే నెల 15 కల్లా నిర్మాణాలు పూర్తి చేయాలని, పునాది స్థాయిలో ఉన్న వారు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించి మార్చి నాటికి పూర్తి చేయాలని సూచించారు.

నీటి సంఘం ఎన్నికలకు చర్యలు



కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట : త్వరలో నీటి సంఘం ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఎస్.నాగమ్మ మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావుతో కలసి ఎన్నికలు నిర్వహించాల్సిన గుండుబాడు, అడ్డసరం, కంచుగుమల, కొవ్వూరు గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో పాఠశాల భవనాలు, మౌలిక సదుపాయాలపై హెచ్ఎంలతో చర్చించారు. కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలలను సందర్శించి ఇక్కడ నీటి సంఘం ఎన్నికల కోసం నాలుగు గదులు గుర్తించారు. ఇక్కడ ఏర్పాట్ల బాధ్యతను ఆర్ఐ రామ్మూర్తికి అప్పగించారు.

15న భారీ అన్నసమారాధన

చీడికాడ: మంచాలలో ఈ నెల 15న కార్తీక పౌర్ణమి పర్వదినం, గైరమ్మ నిమజ్జనోత్సవం సందర్భంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని రామాలయంలో సవితి గైరమ్మను ఏర్పాటు చేశామని అనుపమహోత్సవం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధనతో పాటు సీతారామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు, ఆంజనేయ ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగింపు ఉంటుందన్నారు.

ముసిరిన మబ్బులు..వరి రైతుకు గుబులు

- మొదలైన వరి కోతలు...పలు చోట్ల నూర్పిళ్లు
- ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం నిల్వకు తప్పని తంటాలు
- నియోజకవర్గంలో 38వేల ఎకరాల్లో పంట దశలో వరిచేలు



గాదిరాయిలో ధాన్యం నూర్పిళ్లు

మండలం	ఖరీఫ్ వరి సాగు (ఎకరాల్లో)
మాడుగుల	11,300
చీడికాడ	6000
దేవరాపల్లి	7000
కె. కోటపాడు	15000

మాడుగుల : ఆరుగాలం పండించిన ఖరీఫ్ వరి చేలు ప్రస్తుతం పంట దశకు చేరుకోవడంతో మాడుగుల నియోజకవర్గంలో ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నేటి వరకు ఎటువంటి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయలేదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మబ్బులు రావడంతో కోతలు సమయంలో వర్షాలు పడితే ధాన్యం నష్టపోతామని రైతులు ఆందోళణ చెందుతున్నారు.

ప్రస్తుతం నూర్పిడి యంత్రాల ద్వారా నూర్చిన ధాన్యం ఆరబెట్టి ఎక్కడ దాచుకోవాలని రైతులు సతమతమవుతున్నారు. నియోజకవర్గంలో గోవాడ చెరకు కర్మాగారం పేమెంట్స్ సక్రమంగా ఇవ్వక పోవడంతో రైతులు అందరూ ఖరీఫ్ వరి సాగుపై దృష్టి సారించారు. దీంతో గతంలో 30 వేలఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 38 వేల ఎకరాలకు పైగా సాగు పెంచారు. ఈ ఏడాది ఇంతవరకు వాతావరణం అనుకూలించడం వల్ల చేలన్నీ పంట దశకు చేరుకోవడంతో దిగుబడులు బాగుంటాయని రైతులు ధీమాగా ఉన్నారు. ప్రస్తుతం కోత సమయంలో 20 శాతం తేమ ఉంటుంది. కనీసం మూడు రోజులు నేలపై ఆరబెట్టితే 6 శాతానికి తగ్గుతుంది. 14 శాతం కంటే తేమ ఎక్కువగా ఉంటే ధాన్యం బూజు పడుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం రైతులు అందరూ ఆరబెట్టిన ధాన్యం ఎక్కడ నిల్వ చేసుకోవాలని ఆందోళన చెందుతున్నారు.ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు.

ధాన్యం పాడవకుండా ఉండాలంటే..

నూర్పిడి చేసిన వడ్ల గింజలకు ముక్కు పురుగులు ఆశిస్తాయి. ఈ పురుగు గింజలోపలికి వెళ్లి బియ్యాన్ని ముక్కలు చేసి నష్టాన్ని కలిగిస్తాయి. అలాగే మసి పురుగు, పచ్చపురుగు, పెంకి పురుగులు ధాన్యం పాడుచేయకుండా తగినంత వరకు బాగా ఆరబెట్టి వెదురు గాదెలు, లోహపు గాదెలతో పాటు అందుబాటులో గిడ్డంగులు ఉంటే వాటిల్లో జాగ్రత్త పరుకోవాలి. లేదంటే ఆరబెట్టిన ధాన్యపు సంచులపై మలాధియాన్తో పాటు ఎండోసల్ఫాన్ మందును తగిన మోతాదులో పిచికారి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ధాన్యం నిల్వ పట్ల అవగాహన ఉండాలి



ధాన్యం నిల్వ పట్ల వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. పంట కోసిన తర్వాత ధాన్యం ఆరబెట్టి నిల్వ చేసుకోవాలి. ప్రతి రోజు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. తేమ శాతం ఆర్‌బీకేల్లో తెలుసుకుని ఆ దిశగా రైతులు ధాన్యం నిల్వ చేసుకోవాలి

– ఎం.వాసుదేవరావు ,వ్యవసాయాధికారి, మాడుగుల.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం చేలన్నీ పంట దశకు చేరుకున్నాయి. నూర్పిడి చేస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వాతావరణం బాగోక ధాన్యం భద్రపరచడం చాలా కష్టంగా ఉంది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

– నలాది అచ్చంనాయుడు రైతు, గాదిరాయి

బాలలతో పని చేయిస్తే క్రిమినల్ కేసులు



వస్త్ర దుకాణం తనిఖీ చేస్తున్న కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీవో మంగతాయారు

దేవరాపల్లి : బాల కార్మికులతో పనులు చేయిస్తే సదరు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చోడవరం కార్మికశాఖ అధికారి వి.సూర్యనారాయణ హెచ్చరించారు. దేవరాపల్లిలో ఐసీడీఎస్, పోలీస్, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా మంగళవారం పలు హోటళ్లు, బేకరీలు, వస్త్ర దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవరాపల్లిలోని అయ్యప్ప వస్త్ర దుకాణంలో బాలికకు తక్కువ జీతం చెల్లిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్టు కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ తెలిపారు.18 ఏళ్ల వయసు నిండని బాల బాలికలను ప్రమాదకర వృత్తుల్లో పని చేయించరాదని సూచించారు. దుకాణాలు, బేకరీలో పని చేసే వారికి చట్ట ప్రకారం కనీస వేతనం చెల్లించాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతాయారు, సూపర్‌వైజర్ ఎం.రాములమ్మ, జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు, గ్రామ సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శి ఎం.సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, గాయత్రీ, మౌనిక పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట్రానికి లేదు



మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి : ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట్రానికి లేదని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరాపల్లిలో మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సమావేశం అప్పారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఉమ్మడి ఉప కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పనిచేస్తున్నాయని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం వర్గీకరణ చేస్తే ఐక్యంగా పోరాడి హక్కులు సాధించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు మచ్చ వీర్రాజు, సబ్బవరపు మాలిబాబు, మల్లేటి బుజ్జులు, కంచిమాల అప్పారావు, దువ్వాడ రమేష్, మచ్చ రామారావు, ఉల్లి శ్రీను, మల్లేటి అర్జున, ఉల్లి పరశురాం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక ఏకాదశి పూజలు



తామరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

మాడుగుల/మాడుగుల రూరల్ : కార్తీక ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 200 మంది దంపతులు ఏకాదశి పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని పూలు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో గల సుబ్రమణ్యస్వామికి పూజలు నిర్వహించారు. రామాలయంలో మంగళవారం తెల్లవారుజామున 5 గంటల 24 గంటల పాటు ఏకాహం నిర్వహించారు.

బుచ్చెయ్యపేట : కార్తీక ఏకాదశి సందర్భంగా వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. బుచ్చెయ్యపేట, కొత్తూరు వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మాకవరపాలెం: కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం తామరంలో వేంకటేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కె.కోటపాడు : కార్తీకమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు ఉపవాస దీక్షలను ఆచరించారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు

నర్సీపట్నం : బలిఘట్టం ఉత్తరవాహినిలో వేంచేసి ఉన్న శ్రీసత్యనారాయణ స్వామి సన్నిధిలో కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా మంగళవారం సామూహిక వ్రతాలు ఘనంగా జరిగాయి.ఆయురారోగ్య, ఐశ్వర్యాలు కలగజేయాలని స్వామివారిని ప్రార్థిస్తూ భక్తులు వ్రతాలు, అభిషేకాలు జరిపించుకున్నారు. ఆలయ పురోహితులు పెరివిల్లి భద్రాచల రామం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు స్వర్ణాలంకృత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ అలివేలు మంగతాయారు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచి ఆలయంకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపార్చన చేశారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

గొలుగొండ : ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులు మంచి లాభాలు సాధించవచ్చునని, వీటి సాగులో అంతర పంటలు వేస్తే మరింత లాభాలు వస్తాయని ఉద్యానవనశాఖ అధికారి శిరీషా తెలిపారు. కొత్త మల్లంపేట గ్రామంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తుందని తెలిపారు. నాలుగేళ్లపాటు అంతరపంటలు వేయాలన్నారు. బీమా చేయించుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు నష్టపరిహారం అందుతుందన్నారు. పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరిలో మానిపండు తెగులు

చీడికాడ : ప్రస్తుతం వరిని ఆశిస్తున్న మానిపండు తెగులపై రైతులకు అవగాహన అవసరమని వ్యవసాయ అధికారి కృష్ణవేణి తెలిపారు. మంగళవారం మండలంలోని చుక్కపల్లి, అర్జునగిరి సచివాలయం పరిధిలో నీలంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు వరికి ఆశిస్తున్న మానిపండు తెగులును గుర్తించి రైతులకు నివారణ చర్యలపై సలహాలందించారు. ఈ తెగులుపై ఎటువంటి సలహాలు సూచనలు కావల్సినా మీ పరిధిలో గల సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

మాదక ద్రవ్యాలతో ఎన్నో అనర్థాలు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ రేవతమ్మ



మాట్లాడుతున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు

గొలుగొండ : విద్యార్థులు చిన్నతనం నుండి కష్టపడి చదివి మంచి మార్గంలో నడవాలని విద్యార్థి దశలో మంచి మార్గాన్ని ఎంచుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా కృష్ణదేవిపేట హైస్కూల్, గొలుగొండ కస్తూర్బా కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. కృష్ణదేవిపేట,గొలుగొండ ఎస్ఐలు తారకేశ్వర్రావు, రామారావు పాల్గొన్నారు.

నర్సీపట్నం : మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల మత్తులో పడొద్దు అని విద్యార్థులకు హితవు పలికారు.

జీడితోటలకు బీమాతో రైతుకు ధీమా

చోడవరం రూరల్: జీడి మామిడి రైతులు పంటకు బీమా కల్పించడం ద్వారా నష్టం మోతాదును తగ్గించుకోవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి జి.ప్రభాకర్ సూచించారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వ్యవసాయ సహాయకులు, ఎంపీఈవోలకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎకరానికి రూ.1540 చెల్లించి బీమా పొందవచ్చన్నారు. ఉద్యానవన అధికారి భాను పుష్ప లీలావతి పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు



అధికారులకు సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి నాగ శిరీష

నాతవరం : ఈనెల 15వ తేదీన సరుగుడు గ్రామ పంచాయతీలో జరిగే గ్రామసభకు సంబంధించి అన్ని ఏర్పాట్లు శాఖల వారీగా తయారు సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష అన్నారు. ఆమె మండల ప్రత్యేకాధికారిగా నియమితులైన తర్వాత మొదటిసారిగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల పరిధిలో ఉన్న గిరిజన పంచాయతీల్లో ఒక గిరిజన పంచాయతీలో గ్రామసభ ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. అందులో నాతవరం మండలం సరుగుడులో గ్రామసభ నిర్వహించాలని కలెక్టరు నిర్ణయించారన్నారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం ఈనెల 15 తేదీన అన్ని శాఖలు అధికారులతో సభ ఏర్పాటుకు సంబంధించి ఆదేశాలు ఇచ్చామన్నారు. అనంతరం మండలంలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు.

ఆయుష్ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఆయుష్ వైద్యాధికారి శ్రీదేవి

మాడుగుల రూరల్: ఆయుష్ వైద్యం గురించి గ్రామాల్లో ప్రజలకు ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని కె.జె.పురం ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ డి. శ్రీదేవి పేర్కొన్నారు. జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా, కింతలి, కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో ఆశ కార్యకర్తలకు మంగళవారం ఒక్క రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీదేవి మధుమేహం, సాధారణ వ్యాధులపై అవగాహన కల్పించారు. కె.జె.పురంలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రసాదుపాత్రుడు, డాక్టర్ లీలాప్రసాదు, కింతలి పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారులు మాలంనాయుడు, నాగదివ్య, ఆయుష్ సిబ్బంది మురళి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ వనరులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల : పంచాయతీల్లో ఉన్న వనరులతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సద్వినియోగం చేసుకుని పంచాయతీలు అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లుకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు ఈవోపీఆర్డీ కరుణాకర్ 15వ ఆర్థిక సంఘ నిధులు, జనరల్ ఫండ్స్, పంచాయతీ వనరులు ద్వారా సమకూరే ఆదాయాలపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, సూపరింటెండెంట్ గోపాలరావు పాల్గొన్నారు.

ప్రణాళిక ఆధారంగా అభివృద్ధి

నాతవరం : గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ముందుగా తయారు చేసిన యాక్షన్‌ప్లాన్ కీలకమని పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వెలుగు ఉపాధి హామీ పథకం అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా 2024– 2025 సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి పనులకు యాక్షన్ ప్లాన్ తయారు చేసేందుకు విధి విధానాలపై అవగాహన కల్పించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చెట్టుపల్లి విద్యార్థుల ప్రతిభ



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు జరిగిన ఏపీ స్టేట్ సబ్ జూనియర్, సీనియర్ అండ్ మాస్టర్స్ మెన్ అండ్ విమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చెట్టుపల్లి హైస్కూల్ నుంచి తొమ్మిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎ.పూర్వజ, జె.అక్షయ, ఎం.మణి, ఎం.అమృతవల్లి, ఎం.లక్ష్మీదేవి, జె.అంకిత స్వర్ణ పతకాలు సాధించగా, సిహెచ్.కావ్య, కె.మానస, ఎస్.భాస్కర్ రజత, కాంస్య పతకాలు సాధించారు. వీరిలో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఢిల్లీలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనున్నారు. తొమ్మిది క్రీడాకారులు డిసెంబర్ 8వ తేదీ నుంచి 11 వరకు తెలంగాణలో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ జి.దేవి తెలిపారు. క్రీడాకారులు, పీడీని పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

16న ఉద్యోగ మేళా

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న ఏపీఎస్‌డీసీ, స్కిల్ హబ్‌ల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వి.అప్పలనాయుడులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఉద్యోగమేళాలో నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్స్, పేటీఎం, భారతి ఎయిర్‌టెల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల నిరుద్యోగులు పాల్గొనవలసిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం కళాశాల స్కిల్ హబ్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్‌ను 9494791935 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

చోడవరం : కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రాచీన శివాలయాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఈనెల 13వ తేదీన కార్తీక దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కార్తీక మాసంలో దీపోత్సవానికి ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ ఈ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 51వేల దీపాలను ఈ దీపోత్సవంలో వివిధ ఆకారాల్లో వెలిగిస్తారు. బుధవారం సాయంత్రం 6గంటలకు ఈ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు తెలిపారు.

హోమియో వైద్యంపై శిక్షణ

మాకవరపాలెం: హోమియో వైద్య సేవలపై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. జాతీయ ఆయుష్ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలకు హోమియో వైద్యాధికారి కళావతి శిక్షణ ఇచ్చారు. హోమియో పతి ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు అందించే వైద్య సేవలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవిద్య, సీహెచ్‌వో అనురాధ, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

బుచ్చెయ్యపేట : తురకలపూడి గ్రామంలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కరక గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తురకలపూడి, కరక రెండు గ్రామాల రైతుల భూములు కలిసి ఉన్నాయి. తురకలపూడి రెవెన్యూలో ఉన్న సర్వే నెంబర్ 166లో 7.81 ఎకరాలు, సర్వే నెంబర్ 100లో 18.08 ఎకరాలు,157లో సోమునాయుడు చెరువును ఆక్రమించారని,సర్వే నంబర్ 180లో 1.50 ఎకరాల భూమిని ఆక్రమించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మాడుగుల రూరల్: ఈ నెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అటెండర్ వి.శృతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 వ తేదీన వారోత్సవాలు ప్రారంభం అవుతాయని, అదే రోజున బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులు, విద్యార్థులతో ర్యాలీ, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో కృషి చేసిన వారి గురించి ఇష్టా గోష్టి కార్యక్రమం, 18న పాఠశాల విద్యార్థులకు పోటీలు, 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి, 20న గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

296 మందికి ఉచిత కంటి పరీక్షలు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట,విజయరామరాజుపేట గ్రామాల్లో మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరాల్లో 296 మందికి వైద్య సేవలు అందించారు. బుచ్చెయ్యపేటలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆఫ్తాలమిక్ అధికారి దుర్గా ప్రసాద్,క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్, వైద్య సిబ్బందితో 96 మంది రోగులకి వైద్య సేవలు అందించగా 27 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. విజయరామరాజుపేటలో విశాఖ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆఫ్తాలమిస్టులు తమ సిబ్బందితో 200 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. సర్పంచ్‌లు ఎల్లపు విజయ్‌కుమార్, సుంకరి లక్ష్మి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

నర్సీపట్నం : డీఎల్‌డీఏ, చెట్టుపల్లి పశువైద్యశాల సంయుక్తంగా మండలంలో నీలంపేట గ్రామంలో ఉచిత పశుగర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని నర్సీపట్నం వెటర్నరీ ఏరియా ఆస్పత్రి సహాయ సంచాలకుడు డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు ప్రారంభించారు. శిబిరంలో ఎదకు రాని పశువులకు గర్భకోశ వ్యాధులకు వైద్యం చేశారు. గొంతు వాపు వ్యాధికి టీకాలు వేశారు. 17 లేగ దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 46 మేకలు, 62 కోళ్లకు వైద్య సేవలు అందించారు. వైద్యులు పి.నరేష్, రమేష్, హరిప్రియ, శిరీష, సురేష్, పుష్ప వైద్య సేవలు అందించారు. గ్రామ నాయకులు వెంకునాయుడు, కన్నబాబు, రవిచంద్ర, కృష్ణ, గోపాల మిత్ర గంగరాజు, రాము పాల్గొన్నారు.